

# కథా కౌముది

## పున్నాగపూల జల్లు

మధురవాణి

### శ్రీ జయ నామ సంవత్సర ఉగాది (మార్చ్ 31, 2014) సందర్భంగా
### వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
### 19 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
### యువతరం - ఉత్తమ కథానిక విభాగం విజేత

★★★★

చాలా కార్పొరేట్ కంపెనీల్లాగానే మా ఆఫీసు కూడా రమ్యంగా తీర్చిదిద్దిన కుటీరంలా ఉంటుంది. ఎన్ని వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నా ఏ మాత్రం శబ్ద కాలుష్యం లేకుండా ప్రశాంతంగా ఉంటుంది. పని చేసే వాళ్ళందరూ కూడా మడత నలగని మల్లెపువ్వుల్లాంటి దుస్తుల్లో తిరుగుతూ అంతటా స్వచ్ఛత వెల్లివిరుస్తున్నట్టుంటుంది. ఇక్కడ విధి నిర్వహణలో పడే కష్టాలు, పని ఒత్తిడి, ఆందోళన, సమస్యలు వగైరా అన్నీ కూడా టేబుళ్ళ మీదున్న దీర్ఘచతురస్రాకార పెట్టెలకి, మెడ మీదున్న గుండ్రటి పెట్టెకి తప్ప బయట ప్రపంచానికి ఏ మాత్రం కనపడని అందమైన మాయా జగత్తు ఇది.

అందరూ మనుషుల రూపంలో ఉన్న మరమనుషుల్లా రూపాంతరం చెంది ఒక్కోసారి పక్కన ఎవరున్నారు, ఏం తింటున్నాం, ఎప్పుడు నిద్రపోయాం లాంటివి కూడా గమనించనంత కార్యసిద్ధిలో మునిగిపోయి ఉంటారు. అత్యంత అధునాతనంగా నిర్మించిన భవంతుల చుట్టూ క్రమబద్ధంగా ఏర్పరిచిన విశాలమైన పచ్చిక బయళ్ళు, పొందిగ్గా పెంచిన మొక్కలు, క్రమశిక్షణగా పూచే పూతీవెలు, అక్కడక్కడా చల్లదనాన్ని పంచే వాటర్ ఫౌంటెన్లు, ఎక్కడంటే అక్కడ కాసేపు హాయిగా కూర్చుని ఆ పచ్చదనంలో మమేకమైపోగలిగేలా ప్రతీ యాభై అడుగులకో బెంచీ.. ఇలా చాలా ఆహ్లాదంగా ఉంటుంది మా తపోవనం.

ఇంకా ఫుడ్ కోర్ట్, జిమ్, స్పా ల దగ్గర్నుంచీ ప్లే గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ దాకా సకల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. అదేదో సామెత చెప్పినట్టు కళ్ళ ముందే అన్నీ ఉన్నాయి గానీ ఇక్కడ పని చేసే మాకెవరికీ స్థిమితంగా కాసేపు కూర్చుని ఇవేవీ అనుభవించే తీరికే ఉండదు. ఎప్పుడైనా ఊరికే చూడటానికి వచ్చిన వాళ్ళు ఆహా స్వర్గంలా ఉంది మీ ఆఫీసు, ఇలాంటి చోట్ల పని చెయ్యడానికి పెట్టి పుట్టాలని

మురిసిపోతుంటారు. మాకు మాత్రం ఈ అందాన్ని కప్పేసే బూచిలు ఎన్నో కనిపిస్తుంటాయి. ఏదో శాపంలా ఈ విషయం సంద్రంలో ఈదుతున్న మాకే తెలుస్తుంది తప్ప ఒడ్డున నిలబడి చూసే వాళ్ళకి ఓ పట్టాన అర్థం కాదు.

నేను ఈ కొలువులో చేరి రెండేళ్ళు గడిచిపోయాయి. ఈ రెండేళ్ళలో ఒక్కోరోజు పది, పన్నెండు గంటల కన్నా ఎక్కువ పని చేసిన రోజులు కూడా ఉన్నాయి. అంత సమయం ఇక్కడే గడిపినా సరే ఈ ప్రదేశంతో నాకున్న అనుభవాలు, జ్ఞాపకాలన్నీ కేవలం పనికి సంబంధించినవే అయ్యుంటాయి. టీమ్ వర్క్ పేరుతో రోజుల తరబడి చాలా మందితో కలిసి పని చేసినా మనసు వాకిలి దాకా వచ్చి పలకరించిన స్నేహాలు మాత్రం చాలా అరుదనే చెప్పాలి. అందులోనూ ఏటికి ఎదురు నడుస్తాను అన్నట్టు నలుగురితో పాటు గాలివాటుకి పోకుండా ఇంకేవో దిక్కుల వైపు చూస్తూ నించుంటానేమో.. నాకిలా అనిపించడంలో ఆశ్చర్యం ఏముంటుంది!

కంప్యూటర్లు, కోడింగ్, ప్రోడక్ట్ రిలీజ్, డెడ్ లైన్స్, క్లైంట్ మీటింగ్స్, టీమ్ మీటింగ్స్.. ఇవి తప్ప లోకంలో ముఖ్యమైనవి మరింకేం లేవేమోనని పూర్తిగా నమ్మేసి ఆ దోసెడు నీళ్ళలోనే నిర్విరామంగా ఈదుతున్న నాపై కురిసిన ఓ స్నేహపు జల్లు ఇదివరకెన్నడూ నేనెరుగని కొంగొత్త ఆనందాల తీరానికి దారి చూపించింది.

దాదాపు ఆరు నెలల క్రితం ఏదో అర్జెంట్ వర్క్ ఇష్యూ వచ్చి ఆ రోజు శనివారం అయినా రోజంతా పని చెయ్యాల్సి వచ్చింది. సాయంత్రానికి తలనొప్పితో పాటు విసుగు కూడా వచ్చి డెస్క్ మీద పని అలాగే వదిలేసి ఫుడ్ కోర్ట్ కి వెళ్ళాను. మొత్తంగా పెద్ద నక్షత్రాకారం వచ్చేలా, నక్షత్రపు అంచున ప్రతీ కోణంలో ఒక పెద్ద స్థంభం వచ్చేలా మంచి కళానైపుణ్యంతో కట్టారు మా ఫుడ్ కోర్ట్. ప్రతీ రెండు స్తంభాలనీ కలుపుతూ మధ్యలో కూర్చోడానికి వీలయేంత ఎత్తులో అరుగుల్లాంటివి కట్టి పై కప్పు దాకా ఖాళీగా వదిలేసారు. ఆ స్తంభాలన్నిటికీ రకరకాల పూల తీగలని చిక్కగా అల్లించారు. చుట్టూ చిన్న తోట కూడా ఉంది. ఎప్పుడైనా ఇక్కడకొచ్చి కూర్చున్నప్పుడు రోజూ కాసేపు ఇలా వస్తే హాయిగా సేద తీరినట్టు ఉంటుంది కదా అనిపిస్తుంది. కానీ మళ్ళీ ఏ నెలకో ఇక్కడికొచ్చేదాకా అలా అనుకున్న సంగతే గుర్తుండదు. నాకు రోజూ టీ, కాఫీ తాగే అలవాటు లేకపోవడం దానికో కారణమైతే కాఫీ పేరుతో తీరిగ్గా కూర్చుని కబుర్లాడేంత స్నేహితులెవరూ నాకిక్కడ లేకపోవడం మరో కారణమనుకుంటాను.

ఆ సాయంత్రం తలనొప్పి వదిలించుకోవాలని వెళ్ళిన నేను పెద్ద కాఫీ కప్పు పట్టుకుని ఓ స్తంభానికి అల్లుకున్న 'గార్లిక్ వైన్' తీగకి దగ్గరగా తోట వైపు తిరిగి అరుగు మీద కూర్చున్నా. వేడి కాఫీ కప్పు అరచేతుల్లో అద్దుతున్న వెచ్చదనాన్ని, పూతీగల మీద నుంచి తోసుకొస్తోన్న పిల్లగాలి చల్లదనాన్ని ఏకకాలంలో అనుభవిస్తూ మధ్య మధ్యలో గాలికి మౌనంగా ఊగుతూ సవ్వడి చెయ్యని గంటల్లా సుకుమారంగా ఉన్న ఆ ఊదా రంగు పూల గుత్తుల్ని, దూరంగా తోట పని చేస్తున్న గార్డెన్ స్టాఫ్ ని మార్చి మార్చి చూస్తూ కూర్చున్నా.

"నేను కూడా ఇక్కడ కూర్చోవచ్చా?" ఓ కొత్త గొంతు వినిపించింది.

వెనక్కి తిరిగి చూస్తే స్కై బ్లూ కలర్ మీద కొంచెం డార్క్ బ్లూ చెక్స్ షర్ట్ ఇన్ చేసిన బ్లాక్ పాంట్ కనిపించింది. చొక్కాలు ఎప్పటినుంచి మాట్లాడుతున్నాయబ్బా అని ఆశ్చర్యపోతూ తలెత్తి చూసాను. అదే మొదటిసారి తనని చూడటం!

కాస్త అటూ ఇటూగా ఆరడుగులుంటాడేమో.. నేను కూర్చుని చూడటం వల్ల మరీ అంతెత్తున ఉన్నట్టు కనిపించాడు. మరీ అంత సన్నమూ, అంత లావూ కాదు. మరీ అంత రంగు కాదు. అలాగని చామనఛాయ కూడా కాదు. చిన్న కళ్ళే గానీ చాలా చురుకైన చూపులు. ఆ కళ్ళల్లో కనిపించే దర్పానికి తనేం చెప్పినా మారు మాట్లాడకుండా చేసేస్తారెవరైనా. నేను కూడా వెంటనే "ఊ.." అనేసాను.

పేర్లు, చదువులు, ఉద్యోగ బాధ్యతలు తదితర వివరాలతో పరస్పర పరిచయాలు జరిగాయి. సాధారణంగా కొత్తవాళ్ళ సమక్షంలో ముభావంగా ఉండి అరకొరగా మాట్లాడే నేను తనతో మాములుగానే మాట్లాడేసాను.

మాటల మధ్యలో యథాలాపంగా "యు హావ్ ఎ వెరీ ప్లెజెంట్ స్మైల్.." అన్నాడు మెచ్చుకోలుగా.

ఎప్పుడూ ఏదో రకమైన పొగడ్తలు వినీ వినీ విసుగెత్తిపోయి ఉన్నానేమో 'ఈ అబ్బాయి కూడానా..' అన్నట్టు కాస్త చివుక్కుమనిపించింది మనసుకి.

తను నా మనసు చదివేసినట్టు "అందరికీ నచ్చే అందాన్ని మనం కూడా ఇష్టపడటంలో, చూసి ఆనందించడంలో ఏమన్నా తప్పుందా?" అని చొరవగా అడిగిన తీరుకి ఆశ్చర్యపోయాను.

ఊహించని ఆ ప్రశ్నకి బదులు చెప్పడానికి అప్పటికప్పుడు ఏమీ తోచక "ఉహూ" అని మాత్రం అనగలిగాను.

"ఇంకొంచెం నవ్వండి మరి.." అన్నాడు తేలిగ్గా నవ్వేస్తూ.

అప్పుడంటే అలా అనుకున్నాను గానీ తర్వాత మా ఆరునెలల స్నేహంలో తెలిసింది. తనసలు పొగడాల్సిన అవసరం ఉన్న చోట కూడా దేన్నీ అంత సులువుగా పొగడనంత పొగడ్తల పొదుపరి అని.

ఆ రోజు మా ఇద్దరి మధ్య జరిగిన ఆ అరగంట సంభాషణ తన మీద నాక్కొంచెం ఆసక్తిని కలిగించింది. తన మాటలు వింటుంటే తన తెలివితేటల మీద, లోతైన ఆలోచనాపరిధి మీద కాస్త కుతూహలం కలిగింది. కాస్త విలక్షణమైన వ్యక్తిత్వపు ఛాయలు కనిపించి 'ఇంటరెస్టింగ్ అబ్బాయి..' అనుకున్నానే తప్ప అంతకంటే ఎక్కువ ఇంకేం ఆలోచించలేదు.

తర్వాత ఒక పది రోజులకి తన దగ్గర్నుంచి నా కంపెనీ మెయిల్ ఐడీ కి ఒక ఈమెయిల్ వచ్చింది.

అందులో "కాఫీ?" అని ఉంది.

"మీరు పది రోజులకోసారి కాఫీ తాగుతుంటారా?" రిప్లై ఇచ్చాను.

"ఉహూ.. రోజుకి కనీసం అరడజను సార్లన్నా తాగుతాను. కానీ 'గార్లిక్ వైన్' పక్కన తాగిన కాఫీ ఇవాళే గుర్తొచ్చింది."

"ఓహో.. పది రోజులైనా చెట్టు పేరు బానే గుర్తుందే. నేను కాఫీ తాగనంటే?"

"పువ్వులంటే ఇష్టపడే ఒక అమ్మాయి బాగా గుర్తుండిపోయేలా చెప్పిందిలెండి. కాఫీ వద్దన్నా ఐస్క్రీమ్ కి అయితే 'నో' చెప్పరు కదా.."

ఇలా సాగింది మా మధ్య సంభాషణ. నాక్కూడా మళ్ళీ తనతో కాసేపు మాట్లాడాలనిపించడంతో అట్టే బెట్టు చెయ్యకుండా సరేనన్నాను.

అలా మొదలైన మా ఇద్దరి స్నేహం కొన్ని అందమైన సాయంకాలాల్లో 'గార్లిక్ వైన్' నీడలో కాఫీ సేవనంతో ఎదుగుతూ, ఈమెయిల్స్, ఆఫీస్ కమ్యూనికేటర్ లో చాటింగుల సాయంతో బలపడింది. ఇన్ని నెలల స్నేహంలో మా కబుర్లెప్పుడూ వ్యక్తిగత వివరాలు, విషయాల మీదకి పెద్దగా వెళ్ళేవి కాదు. వర్తమానంలో జరుగుతున్న వార్తలు విశేషాల దగ్గర్నుంచి టెక్నాలజీ, సైన్సు, స్పోర్ట్స్, మతాలు, దేవుళ్ళు, చరిత్ర, ఫిలాసఫీల దాకా కాదేదీ చర్చకి అనర్హం అన్నట్టు మాట్లాడుకునేవాళ్ళం. కొన్నిసార్లు వాదోపవాదాలు, మరి కొన్నిసార్లు ఏకాభిప్రాయాలు, అప్పుడప్పుడూ మేధోమథనాలు, సరదా నవ్వులు, మధ్య మధ్యలో నేను చెప్పే మొక్కలు, పువ్వుల క్లాసులు.. ఇలా ఉత్సాహంగా ఉల్లాసంగా గడిచిపోసాగాయి నా రోజులన్నీ.

ఒకోసారి నాలుగైదు రోజులు తను కనిపించేవాడు కాదు. ఈ మెయిల్స్ కి కూడా బదులు వచ్చేది కాదు. ఏదైనా ముఖ్యమైన ప్రాజెక్ట్ పనిలో తలమునకలుగా ఉన్నప్పుడు ప్రపంచాన్ని పూర్తిగా మర్చిపోవడం తన అలవాటు. మొదట్లో ఇది పెద్ద విషయంలా అనిపించేది కాదు గానీ రోజులు గడిచే కొద్దీ తను కనిపించకపోతే నాకు గుబులు పెరుగుతుండేసరికి నేను తన స్నేహానికి బాగా అలవాటు పడిపోతున్నానని, తనపై ఇష్టం పెంచుకుంటున్నానని అర్థమవ్వసాగింది.

ఒక రోజు అమ్మాయిలు అబ్బాయిల అందచందాలు, సౌందర్యపోషణ గురించి ఇద్దరం సరదాగా వాదించుకుంటూ "మీరేమన్నా తక్కువా? ఎంత శ్రద్ధ ఆ క్రాఫ్ మీద. ఎప్పుడైనా పెద్ద గాలివానలో తడిచినప్పుడు మిమ్మల్ని చూడాలనుంది. అసలు నాకో సందేహం. పాపం జుట్టుని కూడా మీ స్టైల్లో బెదిరించి మాట వినేట్టు చేస్తుంటారా?" అన్నాను ఆట పట్టిస్తూ.

"నాకేం అంత శ్రద్ధ లేదు. మా ఆవిడే రోజూ పావుగంట సేపు కూర్చోబెట్టి తల దువ్వుతుంది" క్షణం ఆలస్యం లేకుండా దూసుకొచ్చింది జవాబు.

ఆ మాట వినగానే అస్సలే మాత్రం ఆలోచన లేకుండా "అంటే మీకు పెళ్ళయిపోయిందా?" అని అడిగేసి నా తొందరపాటుకి నన్ను నేనే మనసులో తిట్టుకున్నాను.

"ఊ.. అయ్యాయిగా ఒకటో రెండో.."

తన మాటల్లో, మొహంలో ఎప్పుడూ అదే మామూలుతనం. తన అంతరంగాన్ని పోల్చుకోలేక ఎదుటి మనిషి అయోమయంలో పడిపోయేలా..

నేను గతుక్కుమని ఓ క్షణం కనురెప్పలు వెయ్యడం మర్చిపోయి అలానే చూసాను తన మొహంలోకి. బహుశా అక్కడ సరైన సమాధానం దొరుకుతుందన్న ఆశ కాబోలు. కానీ తన కళ్ళు, మోము తనని ఎప్పుడూ పట్టించవు.

నేను మౌనంగా ఉండిపోయేసరికి "ఏంటీ.. కంగారుపడ్డారా?" అని తేలిగ్గా నవ్వేసాడు.

నాకు సిగ్గనిపించి దాన్ని దాచే ప్రయత్నం చేస్తూ "అయ్యో పాపం మీకు రెండు పెళ్ళిళ్ళా.." అన్నాను జాలిగా మొహం పెట్టి.

"ఊ.. అవును. పాపం కదా నేను. అందుకే ముచ్చటగా మూడోసారైనా సరైన అమ్మాయిని వెతుక్కోవాలనుకుంటున్నా. మీకేమైనా మంచి సంబంధం తెలిస్తే చెప్తారు కదూ" అన్నాడు అర్థింపుగా.

నేను కష్టపడి లోలోపలే అదిమిపెడుతున్న ఉక్రోషాన్నిఎలాగైనా బయటికి తెచ్చేదాకా ఊరుకునేలా లేదు మొండిఘటం.. అని తిట్టుకుంటూ ఇబ్బందిగా నవ్వాను.

తను నా మొహంలోకి చూస్తూ గట్టిగా నవ్వేసాడు. అలా నవ్వుతూనే ఉన్నాడు చాలాసేపటి దాకా.

ఆ రోజు తనని చూస్తూ... చిన్నప్పుడు శీతాకాలపు తొలి పొద్దుల్లో పున్నాగ చెట్టు కింద చేరి కష్టపడి వెతికి వెతికి ఒక్కో పువ్వూ ఏరుకుంటుంటే ఉన్నట్టుండి గట్టిగా గాలి వీచి రాత్రంతా మంచులో తడిసిన పున్నాగ పూలన్నీ చెట్టు మీద నుంచీ ఒకేసారి జల్లులా కురిసి నిలువెల్లా తడిపేసిన జ్ఞాపకం తలపుకొచ్చింది. నిర్మలంగా, నిండుగా, కేవలం నన్ను మురిపించడానికే పుట్టినంత అపురూపంగా, నన్ను ఆజన్మాంతం కట్టిపడేసేలా, వెన్నెల రాత్రుల్లో గాఢంగా కమ్ముకుంటున్న పున్నాగ పూల పరిమళంలా... ఎంత సమ్మోహనంగా ఉందో తన నవ్వు!

నాలుగు వారాల క్రితం మాటల మధ్యలో యథాలాపంగా "ఎప్పుడైనా నేను కనిపించకుండా ఉన్నట్టుండి మాయం అయ్యాననుకోండి. అప్పుడేం చేస్తారు?" అని అడిగాడు.

"ఆఫీస్ మెయిల్, ఫోన్ ఉంటుందిగా.." అన్నాను ధీమాగా.

"అది ఆఫీస్లో ఉన్నంత వరకేగా.." తన కళ్ళల్లో అల్లరితనం తొంగి చూస్తోంది.

ఇతగాడికేంటో ఎప్పుడూ నాతో ఈ ఆట. ఇలా చిక్కుల్లో పడేసే ప్రశ్నలు అడిగేసి తీరిగ్గా కూర్చుని నా కళ్ళలో ఉన్నదేదో చదవాలని ప్రయత్నిస్తుంటాడు మహా గడుసుగా.. అనుకుంటూ వెంటనే తెలివి తెచ్చుకుని "మరి నేను మాయం అయిపోతే ఎలా?" అని ప్రశ్నకి ప్రశ్నే బదులిచ్చాను.

"మాయం అయినా నేను మిమ్మల్ని వెతికి పట్టుకోగలను" అన్నాడు చాలా తేలిగ్గా.

ఆశ్చర్యంగా కళ్ళు విప్పార్చి "ఎలా?" అన్నాన్నేను.

"ఎలా అంటే.. నాకు మేజిక్ వచ్చుగా" నవ్వాడు నా దోసిట్లో పున్నాగలు నింపేస్తూ...

తన వేలు పట్టుకుని పున్నాగల లోకంలోకి వెళ్ళబోతున్న నన్ను ఈ లోకంలోకి లాక్కొస్తూ "ఇది నా మొబైల్ నంబర్. ఎప్పుడైనా కాల్ చెయ్యండి. అవసరమైతేనే సుమా.." అన్నాడు కాస్తంత గంభీరంగా.

అప్పుడు ఉక్రోషం కాదు కోపమే వచ్చేసింది. అవసరమైతేనే చెయ్యాలట. అంటే ఇంక నాకేం పని లేనట్టు తనకి ఫోన్ చేస్తూ కూర్చుంటానా.. అనుకున్నా రోషంగా.

నేనూ కాస్తైనా బెట్టు చెయ్యాలని "మరి నా నంబర్ వద్దా?" అన్నాను ఫోజుగా.

"ఉహూ.. అక్కర్లేదు" అన్నాడు.

ఈసారి మాత్రం కోపంతో పాటు తిక్క కూడా వచ్చింది. ఏం మాట్లాడకుండా దిక్కులు చూస్తూ నించున్నా.

"మీరు పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి కాల్ చేస్తారా?" తనే అడిగాడు.

తనేమన్నాడో అర్థం కావడానికి ఎంతోసేపు పట్టలేదు.

"మరి నాకేం అవసరం రాక నేను కాల్ చెయ్యకపోతే అప్పుడెలా? మీకు అవసరమే ఉండదనా?" అన్నాను 'అవసరం' అనే పదాన్ని వత్తి పలుకుతూ.

తను నాలా ఉడుక్కోకుండా "చెప్పానుగా నాకు మేజిక్ వచ్చని.." అని ఓ క్షణం ఆగి "సరే మరి.. నాకు మీటింగ్ టైమైంది వెళ్తాను" అని లేచాడు.

నాకు ఒళ్ళు మండిపోయింది. నేను కాసేపు ఇక్కడే ఉంటానన్నాను.

అబ్బా ఎంత పొగరు కాకపోతే నేనేమన్నా తన ఫోన్ నంబర్ అడిగానా, పైగా అవసరమైతేనే కాల్ చెయ్యాలట, మళ్ళీ మేజిక్ వచ్చని పెద్ద ఫోజొకటి. అక్కడికి నేనేదో తను లేకపోతే ఉండలేనట్టు. అసలు నేను కాల్ చెయ్యకుండా ఉంటే సరి. అప్పుడు తెలిసొస్తుంది అబ్బాయి గారికి.. అనుకున్నాను పంతంగా. కానీ తన పట్టుదల గురించి బాగా తెలిసిన నాకు నిజంగానే తేలిగ్గా తీసుకుని తనూ పట్టించుకోకుండా ఊరుకుంటాడేమో అన్న భయం లేకపోలేదు. కానీ అప్పుడు కోపం కొద్దీ ఆ వైపు ఆలోచించడానికి ఇష్టపడలేదు.

★★★★★★★★★★

నాలుగు వారాలు నాలుగు యుగాల్లా గడిచాయి.

ఆ సంఘటన తర్వాత నేను తనని ఫోన్లో కాదు కదా కనీసం మెయిల్లోనైనా పలకరించే ప్రయత్నం చెయ్యలేదు. తనని చాలా మిస్సవుతున్నానన్న బెంగనీ, పదే పదే తనని చూడాలని తపించిపోయే మనసు ఆరాటాన్నీ, తను నన్ను మాట్లాడించే ప్రయత్నం చెయ్యడంలేదుగా అన్న బాధ గెలిచి నేను రాసిన మెయిల్స్ అన్నీ డ్రాఫ్ట్స్ లోనే నిద్రపోయేలా చేసింది. ఇన్ని వేల మంది పని చేసే చోట అంత

సులువుగా జరిగే పని కాదని తెలిసినా ఆఫీస్ క్యాంపస్ లో ఎప్పుడో అప్పుడు ఎక్కడో చోట అదాటుగానైనా తను ఎదురుపడకపోతాడా అని ఆశగా ఎదురు చూసాను. అదీ జరగలేదు.

అప్పటి కోపం, పంతం, ఉక్రోషం అన్నీ ఇరవై నాలుగు గంటలకి మించి మా వల్ల కాదంటూ దీక్ష విరమించేసి నన్ను ఒంటరితనంలో పడేసాయి. నేను ప్రతి రోజూ ఇరవై నాలుగు గంటలని రెండొందల నలభై గంటల్లా మార్చి భారంగా చూసుకుంటూ కాఫీ మీదా, కాఫీ కప్పుల మీదా యుద్ధాలు ప్రకటిస్తూ, మంచం మీదా, కిటికీ ముందూ గంటల తరబడి ధ్యానాలు చేస్తూ, కనపడిన ప్రతి చెట్టులోనూ పున్నాగ పూలని వెతుక్కుంటూ దిగులుగా ఉండిపోయాను. తను దూరమైన దగ్గర్నుంచీ రోజురోజుకీ తన మీద పెంచుకుంటున్న ఇష్టం స్నేహపు హద్దు దాటేసి ప్రేమగా మారి నాలో దాచుకోలేనంతగా పెరిగి పెద్దదైపోతోందని గ్రహింపుకొస్తోంది.

పనిలో పడి ఐదు రోజులూ ఎలానో పరిగెడతాయి కానీ శనాదివారాలతో భలే హింస. ఎక్కడికీ వెళ్ళాలనిపించదు. ఎవరితోనూ మాట్లాడలనిపించదు. తన జ్ఞాపకాలన్నీ కట్ట గట్టుకుని గడియారంలో తిష్ట వేసుక్కూర్చుని కాలాన్ని అట్టే కదలనివ్వకుండా కట్టడి చేస్తుంటాయి. కదలనని మొండికేస్తున్న కాలాన్ని ఎలా అదిలించాలో తెలీక తెగ సతమతమైపోతూ నేను!

ఆదివారం మధ్యాహ్న వేళ బాల్కనీలో కుండీల్లో ఉన్న పూలమొక్కల బాగోగుల్ని చూస్తూ కూర్చున్నాను.

'ఎంతెంత దూరం నన్ను పోపోమన్నా అంతంత చేరువై నీతో ఉన్నా'నంటూ నా ఫోన్ పిలుస్తోంది.

ఇప్పుడసలు ఎవరితో మాట్లాడే మూడ్ లేదని విననట్టు ఊరుకున్నాను. నువ్వెంత పోపొమ్మన్నా నా రాక తప్పదంటూ మళ్ళీ మళ్ళీ గొంతు చించుకు అరుస్తోంది ఫోన్.

ఇక లాభం లేదని నేను పూల కుండీల దగ్గర్నుంచి లేచాను. తీరిగ్గా మట్టి చేతులు కడుక్కుని వెళ్ళేదాకా ఇంకా అరుస్తూనే ఉంది ఫోన్.

స్క్రీన్ మీద 'పున్నాగల అబ్బాయి' అని చూడగానే గుండె ఝల్లుమంది. కలో నిజమో అర్థం కాలేదు. కంగారులో నేను ఫోన్ ఆన్సర్ చెయ్యాలన్న సంగతి మర్చిపోయాను. 5 మిస్డ్ కాల్స్ అని ఉస్సూరంది సెల్ ఫోను. ఉన్నపళంగా కుర్చీలో కూలబడి దానితో పాటు నేనూ నిట్టూర్చాను.

తను ఫోన్ చేసాడా, నాకోసం తనే చేసాడా, అసలు తనెందుకు ఫోన్ చేసాడు, నా నంబర్ ఎలా తెలిసింది, నిజంగానే మేజిక్ వచ్చా ఏంటి, అయినా నెల రోజులుగా మాటా మంతీ లేని అబ్బాయి గారికి ఇప్పుడు మాత్రం ఎందుకు గుర్తొచ్చానో, ఇప్పటికే ఐదు సార్లు కాల్ చేస్తే ఆన్సర్ చెయ్యకుండా వదిలేసాను కదా, మళ్ళీ కాల్ చేస్తాడా లేకపోతే పోతే పోనీలే అని ఊరుకుంటాడా.. రకరకాల ఊహాగానాలతో ఆశ్చర్యం, ఆనందం, పంతం, కోపం, దిగులు, ఆశ, నిరాశల మధ్య కొట్టుకులాడుతోంది మనసు.

నా ఆలోచనలన్నీ ఛేదిస్తూ పది నిమిషాల్లో మళ్ళీ మోగింది ఫోన్. అపురూపమైన అదృష్టమేదో చేజారిపోతుందన్నట్టు చప్పున ఫోన్ ఎత్తాను.

అవతలి నుంచి "హలో" అంటూ తన గొంతు వినిపించింది.

ఆ స్వరంలో మార్దవం, నీ కోసమే వచ్చానన్నట్టు అనునయం.. ఇన్నాళ్ళ తర్వాత తన గొంతు చెవిన పడగానే ఇన్నాళ్ళు గుండెల్లో గూడు కట్టుకున్న దిగులంతా నీరై కళ్ళల్లోంచి ఒలికిపోతోంది.

నేను వెంటనే బదులు పలక్కపోయేసరికి మళ్ళీ పిలిచాడు తను.

నా మౌనం ఈ ఆనందాన్ని మాయం చేస్తుందేమోనన్న భయం కొద్దీ అతి కష్టం మీద మాట పెగిలింది.

"ఏంటండీ.. ఇన్ని సార్లు చేస్తే గానీ ఫోన్ ఆన్సర్ చెయ్యలేదు. నాలుగు వారాలకే మర్చిపోయారా?" తన గొంతులో ఎప్పటిలాగే అదే మామూలుతనం, చెక్కుచెదరని ప్రశాంతత.

నాలుగు వారాలకే అని ఎంత మామూలుగా అంటున్నాడు. ఇదే నాకు నాలుగు యుగాల్లా గడిచిందని తనకెలా తెలుస్తుంది?

"నన్నే కాదు నా గొంతుని కూడా మర్చిపోయారన్నమాట. ఎప్పుడన్నా ఎదురుపడితే హలో అయినా చెప్తారో లేదో" తన మాటల్లో అప్పుడప్పుడూ తొంగి చూసే అల్లరి కవ్విస్తోంది.

"ఉహూ అదేం కాదు. నిద్రలో నుంచి గబుక్కున లేచి వచ్చేసరికి..." అస్సలు అతకని అబద్ధం ఆడేసాను.

"ఓ.. పగటి కలలు కంటున్నారా అమ్మాయి గారు.. మంచి కల చెడగొట్టానా నేను మధ్యలో వచ్చి.." నన్ను ఎప్పటిలా మాట్లాడించాలన్న తన ప్రయత్నం కనిపిస్తోంది.

"ఇంతకీ ఇప్పుడు మీకు నాతో ఏం అవసరం వచ్చిందని ఇలా మా మీద దయ చూపించారు?" ఎంత వద్దనుకున్నా నా మాటల్లో నిష్ఠూరం కొట్టొచ్చినట్టు తెలుస్తోంది.

తను నవ్వుతున్నాడు. తెరలు తెరలుగా పున్నాగ పూల జల్లు కురుస్తోంది. ఇన్ని రోజుల పాటు మనసు పోగేసిన దిగులునంతా మాయం చేసేస్తూ చిక్కటి పున్నాగ తావి నా చుట్టూ, గదంతా, ఇల్లంతా, ఊరంతా, ఈ లోకమంతా అలముకుంటోంది. నవ్వుల అలలు ఆగిపోయి మాటలు వినిపిస్తున్నాయి.

"నా 'అవసరం' మరీ ఇంత పని చేస్తుందనుకోలేదు. పోనీలెండి మీ బాకీ తీర్చేస్తాను. నాకో అవకాశం ఇస్తారా మరి?"

నేను ఊ అనలేదు ఉహూ అనలేదు. నా సమాధానం కోసం ఎదురు చూడకుండా తనే చెప్పాడు.

"ఐస్క్రీమ్? మీ పక్క వీధిలో ఉన్న 'క్రీమ్ స్టోన్' లో.. టెన్ పీఎమ్ ఆఫ్టర్ యువర్ డిన్నర్.. ఎదురు చూస్తాను. సరే ఇక ఉండనా మరి.."

ఏదో మంత్రం వేసినట్టు "ఊ.." అనేసాను.

"సీ యు దేర్.." కాల్ కట్ అయింది.

ఆ నిశబ్దంలో కూడా తనాడిన మాటల తాలూకూ స్వరజతులేవో ప్రతిధ్వనిస్తున్నట్టు నేను కాసేపటి దాకా ఫోన్ పట్టుకుని అలానే ఉండిపోయాను. తర్వాత పాదాలు ఎక్కడా క్షణమైనా నిలవక ఇంట్లో ప్రతి అణువణువుకీ నా సంబరాన్ని చాటి చెప్పాయి.

నీళ్ళకి అలుపొచ్చేదాకా తలారా స్నానం చేసొచ్చి జుట్టు ఆరబెట్టుకుంటూ ఫ్యాన్ కింద కూర్చున్నా. క్షణానికో రకమైన తలపు తోసుకొచ్చి రకరకాల భావాలు కలగాపులగమైపోతున్నాయి.

ఈ అబ్బాయికి ఎంత పొగరో అసలు.. నేను మాత్రం తన కోసం తపించిపోతుంటే తను మాత్రం అదేం పట్టనట్టు చాలా స్థిమితంగా కనిపిస్తాడు. తన మనసు తెలుసుకోవడం చాలా కష్టం. ఎలా తనని దొరకబుచ్చుకోవడం? అసలు తన నియంత్రణ అంతా ఆ కళ్ళల్లోనే చేరి దర్పం ఒలకబోస్తుంటుంది. ఒక్క క్షణమైనా ఆ కళ్ళని మెరిపించి చూపు మరల్చగలిగితేనో? అన్నట్టు అబ్బాయి గారు పొగడ్తలకి బహు దూరం కదూ.. లాభం లేదు ఎలాగైనా సరే ఇవాళ తన చేత పొగిడించుకోవాలి.

ఇలా సాగుతున్న నా ఆలోచనలకి నాకే నవ్వొచ్చింది. ఎన్నడూ చెయ్యని వింత పనులన్నీ చేస్తూ నాకు నేనే కొత్తగా కనిపిస్తున్నా. ఇన్నాళ్ళూ ప్రతి ఒక్కరూ నాకేసి అపురూపంగా చూస్తూ పొగడ్తలు కురిపిస్తుంటే పొగడ్తలంటేనే మొహం మొత్తేసింది. చిత్రంగా

ఇప్పుడీ పొగరుబోతు పిల్లాడితో పొగిడించుకోవాలని ఆరాటపడిపోతున్నా. ప్రేమా పిచ్చీ ఒకటేనని ఎవరో కవి గారన్న మాట నిజంగా నిజమేనేమో!

"అతగాడు నోరు తెరిచి ఒక్క మాట మెచ్చుకోలుగా అనడమే గగనం. ఇక పొగడ్తలు కూడానా.. ఉహూ నీ ప్రతినలు చెల్లేవి కావు" లెమ్మని అంతరాత్మ ఎద్దేవా చేస్తోంటే అద్దంలో వెలిగిపోతున్న అందానికి పౌరుషం వచ్చేసింది.

సరే అదీ చూద్దామని వెళ్ళి క్లోజెట్ తెరిస్తే అన్నీ బానే ఉన్నట్టు, అయినా ఏదీ బాలేనట్టు అనిపిస్తున్నాయి. దొంతరలు దొంతరలుగా పేర్చిన జీన్స్, లెగ్గింగ్స్, చుడీదార్లూ, స్కర్ట్స్.. ఉహూ ఏదీ నచ్చట్లేదు. ఎంతో ఆచి తూచి కొంటానే అయినా ఇప్పుడు ఒక్క జతా నచ్చింది కనపడదేమని అసహనంగా ఉంది. ఇప్పటికిప్పుడు నా ఇష్టాయిష్టాలిలా మారిపోతుంటే పాపం అవేం చేస్తాయిలే అనుకుంటుండగా ఎప్పుడో తప్ప నేను తెరవని చీరల అర కళ్ళల్లో పడింది.

అది తెరిచి చీరలన్నీ పరీక్షగా చూస్తుంటే "ఏదో పెళ్ళికి వెళ్ళినట్టు ఐస్క్రీమ్ పార్లర్ కి చీర కట్టుకు వెళితే తిక్కలమ్మలా ఉంటానేమో.. అసలే ఈ మనిషి మహా తెలివైన ఘటం. నా మనసులో ఉన్నవన్నీ న్యూస్ పేపర్ చదివినంత తాపీగా చదివెయ్యగలడు. మరిప్పుడెలా?" అని పెద్ద సందేహం. ఏ బట్టలు వేసుకోవాలో తేల్చుకోడం కూడా ఇంత కష్టమైన పనని మొదటిసారి తెలిసొచ్చింది.

ఇంతలో అన్నిటికన్నా చివరన ఓ మూలన దాక్కుని ఉన్న తెల్ల చీర కనిపించింది. అది తెలుపు కూడా కాదు పాల మీద పల్చగా కట్టిన మీగడ తరకలా ఉండీ లేనట్టుగా రవ్వంత పసుపు రంగు అద్దుకున్న లాంటి తెలుపు. పాలనురుగు లాంటి తేలికైన చీర మీద అక్కడక్కడా మెరుస్తూ బంగారు రంగు దారంతో కుట్టిన చిన్ని పువ్వులు. ఎప్పుడో ఒకసారి ఒక మాల్ లో ఫోటోలో కనిపించిన చీరని చూసి చాలా ముచ్చటపడి కొన్నాను కానీ ఇప్పటిదాకా కట్టుకోనేలేదు. ఉహూ.. ఆ చీరతో పోటీ పడేంత అందమైన సందర్భం ఇప్పటివరకూ రానేలేదు. ఇప్పుడా చీరలో తనకి కనిపించాలనిపిస్తోంది. ప్రేమా.. పిచ్చీ.. మళ్ళీ ఇంకోసారి పాడుకున్నా.

గోడ గడియారం తొమ్మిది చూపిస్తోంది. తనని చూడాలంటే ఇంకా గంటసేపు ఎదురు చూడాలా అని ఆత్రపడిపోతోంది మనసు. నాకంటే ఆకలీ, దప్పికా ఎలానో తెలిసేలా లేవు గానీ పాపం గడియారానికి నాలా కొత్త పిచ్చేం పట్టుకోలేదుగా. అందుకే అది మాములుగా నడుస్తోంది ఏ మాత్రం ఆత్రం లేకుండా. ఓ నాలుగు గంటల క్రితం సర్వం కోల్పోయినట్టు ఎంత నిరాశలో ఉన్నాను, కాసేపట్లో ఎంత మార్పు.. నెల రోజుల నుంచీ ఉన్న కోపం, పంతం అన్నీ ఎటు పారిపోయాయో.. మాయగాడు!

ఫోన్ అందుకుని తనకి మెసేజ్ పెట్టాను.

"డిడ్ ఎనీవన్ ఎవర్ టోల్డ్ యు దట్ యు ఆర్ గుడ్ ఎట్ మానిప్యులేటింగ్ పీపుల్?"

అరగంటకి జవాబు వచ్చింది "నో.. బట్ ఐ నో అయామ్" అని.

"అబ్బో.. ఎంత అతిశయమో.." అని ఉడుక్కున్నాను.

టైం పది నిమిషాల తక్కువ పది అయ్యేదాక కష్టపడి ఎదురు చూసి ఇల్లు తాళం వేసి కిందకొచ్చాను. వెళ్ళేది పక్క వీధి దాకానే అయినా ఈ టైంలో బండి తీస్తుంటే ప్రియాంక చోప్రా "వై షుడ్ బోయ్స్ హేవ్ ఆల్ ద ఫన్?" యాడ్ గుర్తొచ్చి నవ్వొచ్చింది.

అవునూ.. అసలు తనకి మా ఇంటి అడ్రస్ ఎలా తెల్సు, ఇంటి పక్కన 'క్రీమ్ స్టోన్' అని అంత కరక్ట్ గా చెప్పాడే.. అని ఆలస్యంగా వెలిగింది ఇంకో సందేహపు లైటు. ఓహో ఎంతైనా 'మేజిక్ మేన్' కదా.. అనుకున్నా కినుకగా.

'క్రీమ్ స్టోన్' లో అడుగు పెడుతూ చేతికున్న వాచ్ చూసుకుంటే ఇంకా రెండు నిమిషాలుంది పదవడానికి.

లోపలికి వస్తూనే నా కళ్ళు చుట్టూ వెతికేస్తున్నాయి తన కోసం. తనింకా రాలేదని ఉక్రోషపడబోయేంతలో "హాయ్" అని వినిపించింది వెనుక నుంచి.

చప్పున తిరిగి చూసేసరికి సరిగ్గా ఒకే అడుగు దూరంలో నా వెనకే తను.. ఊహించని విధంగా తనకి అంత చేరువలో నించునేసరికి కలవరపడి కదలకుండా బొమ్మలా నించుండిపోయాను. తను పక్కకి జరిగే లోపు తలెత్తి తన మొహంలోకి చూడలేక బిక్కుబిక్కుమంటూ కళ్ళు నేలకప్పగించేసాను. సాయంత్రం ఇంట్లో పలికిన ప్రగల్భాలన్నీ గుర్తు చేసి అంతరాత్మ పరిహాసంగా నవ్వింది.

అక్కడ కూర్చుందామంటూ తను ముందుకి కదులుతుంటే మౌనంగా అనుసరించాను.

"ఏంటి మీరేం మాట్లాడటం లేదు. నేనింకా కత్తులో గదలో తీసుకొచ్చి నా మీద యుద్ధం చేస్తారనుకున్నానే" అన్నాడు.

చిన్నగా నవ్వి తలెత్తి చూసి "సేమ్ పించ్" అనేసి నాలుక్కరుచుకున్నా.

"సేమ్ పించా.." అని ఓ క్షణం ఆగి తన షర్ట్ కేసి చూసుకుని "ఓహో ఇద్దరం ఒకే కలర్ డ్రస్ అనా.." మళ్ళీ తన నవ్వుతో పున్నాగ పూల తోటలోకి తీసుకెళుతున్నాడు నన్ను.

"మీరసలు కిండర్ గార్డెన్లో ఉండాల్సిన వాళ్ళు. పొరపాటున ఇంజనీర్ అయిపోయారు" ఇంకా నవ్వుతూనే ఉన్నాడు.

చిత్రంగా నాకసలు ఉక్రోషం రావట్లేదు.

వేరే ఏదన్నా మాట్లాడాలని "మీరేంటి ఎదురు చూస్తానని చెప్పి నాకన్నా ఆలస్యంగా వచ్చారు?" చూసావా నీలో ఒక తప్పు దొరకబుచ్చుకున్నాను అన్నట్టు కాస్త ధీమాగా కళ్ళెత్తి అడిగాను.

"నేను మాట తప్పలేదుగా. పన్నెండు నిమిషాలు ఎదురు చూసాను మీ కోసం."

ఆశ్చర్యపోయాను. "పన్నెండు నిమిషాలా.. నాకోసమా.. ఎప్పుడూ?" కొంచెం గట్టిగానే అడిగేసాను.

"మీ ఇంటి ముందే. మీరు బయలుదేరాక మీ వెనకే వచ్చాను."

"మా ఇంటి దగ్గరా.. మరి నన్ను పిలవలేదేం? అయినా ఎదురు చూడటం ఎందుకు? పైకి రావాల్సింది కదా.." కాస్త నొచ్చుకున్నాను.

"ప్రోగ్రాం ఇక్కడ కలుద్దామని కదాని పైకి రాలేదు. కాసేపే కదా.. చేతిలో ఫోన్ ఉంది. బోర్ కొట్టలేదు లెండి."

"అర్థం కాలేదు. ఇక్కడ కలుద్దామనుకుంటే మా ఇంటి దగ్గర ఎందుకు ఎదురు చూసారు?"

"ఓ అదా.. రాత్రి పదింటికి మీరొక్కరే రావాలి కదాని కాస్త తోడుగా వెనకే వచ్చాలెండి."

"నాకు తోడూ కోసమా.."

"ఆగండాగండి.. మీకా మాత్రం ధైర్యం లేదని కాదు. ఊరికే ఐ జస్ట్ ఫెల్ట్ లైక్ డూయింగ్ ఇట్. అంతే.." నా మాట పూర్తి కాకుండా మధ్యలోనే ఆపి వివరణ ఇచ్చేసాడు.

'అవసరం' విషయంలో అనుభవాన్ని బట్టి నేను ప్రతీదానికి ఇలా గింజుకుని పెంకిగా గోల చేస్తానని అనుకుంటున్నాడేమో. పాపం నేనే మరీ ఎక్కువ పట్టుదలకి పోయి తనని ఇబ్బంది పెట్టానా? నేనే ముందు తనకి ఫోన్ చేసి ఉండాల్సిందేమో.. నేనేం తనని నిర్లక్ష్యం చెయ్యలేదని చెప్పేదెలా? అసలు తనేం అనుకుంటున్నాడో నా గురించి.. ఊరికే మంచి స్నేహితురాలు అనుకుంటున్నాడా.. లేకపోతే నిజంగా తనకి ఒకటో రెండో పెళ్ళిళ్ళు అయిపోయుంటాయా? నా ఆలోచనలు గట్టు తెగిన ఏరులా ఓ పద్ధతీ పాడూ లేకుండా తలో దారికి కొట్టుకుపోతున్నాయి.

"చీరలో చాలా బావున్నారు. మీ చేతి మీద బంగారం పోటీ పడలేక వెలవెలబోతోంది" నా చేతికున్న గాజుకేసి చూస్తూ చెప్పాడు.

ఊహించని తన పొగడ్తకి నన్ను అప్పటిదాకా ఆందోళన పెడుతున్న ఆలోచనల సంగతి మర్చిపోయి మళ్ళీ ఆశ్చర్యంలోకి వచ్చి పడ్డాను.

"తెలుపు మీకిష్టమా? ఈ చీరలో చూస్తుంటే..." అని ఓ క్షణం ఆగాడు.

ఇదివరకెప్పుడూ తన కళ్ళలో చూడని చిలిపితనాన్ని కొత్తగా చూసాను. కానీ అది క్షణంలో సగం సేపే..

"పెళ్ళిలో ఈ రంగు చీరే కట్టుకుంటారు కదా.. మీకూ అదేనా గుర్తొచ్చింది?" అన్నాడు సాధ్యమైనంత అమాయకత్వం ఉట్టిపడేలా.

నా మొహంలో కదిలే భావాల్ని ఒడిసి పట్టే ప్రయత్నం చేస్తున్నాడని తెలుస్తోంది.

"ఊ.. తలంబ్రాల చీర ఈ రంగులోనే ఉంటుంది కానీ ఇలాంటివి కట్టుకోరు పెళ్ళిలో. పట్టుచీరలే కట్టుకుంటారు" అది కూడా తెలీదన్నట్టు ఆక్షేపణగా అన్నాను.

"ఏమోలే నాకేం తెలుసు చీరల గురించి. అయినా ఎప్పుడూ మీరు ఎక్కువ మాట్లాడితే నేను వినేవాడిని. మీరు సైలెంట్ గా ఉండేసరికి నేను ఏదో ఒకటి మాట్లాడాల్సి వస్తోంది" చాలా తేలిగ్గా అనేసాడు.

అంటే ఏదోకటి మాట్లాడాలి కదాని నాకీ మెచ్చుకోలా.. పాపమని నాకో పొగడ్త దానం ఇచ్చినట్టు పెద్ద ఫోజు. ఒళ్ళంతా పొగరే.. గట్టిగానే తిట్టుకున్నాను ఈసారి.

ఆ కోపంలోంచి "నెల రోజుల నించీ ఏమైపోయారు. అసలు కనపడలేదేం?" అని గట్టిగా కడిగేసాను.

"ఆఫీస్ వర్క్ మీద బెంగళూరు వెళ్ళాను. ఇవాళ ఉదయమే వచ్చాను" బుద్ధిగా చెప్పాడు సమాధానం.

ఇతగాడితో అస్తమానూ ఆశ్చర్యపోడమే నా పని అన్నట్టుంది.

కాస్త తేరుకుని "ఊరెళ్ళారా.. మరి నాతో ఒక్క మాటైనా చెప్పలేదేం?" అనడిగాను.

"అందుకేగా ఆ రోజు మీకు ఫోన్ నంబర్ ఇచ్చాను. మీరు కాల్ చేస్తారనుకున్నాను. ఇలా పూర్తిగా మర్చిపోయి పట్టించుకోరనుకోలేదు" నన్ను నేనే తప్పట్టుకునేలా సంధించాడు అస్త్రం.

"అలాగని నాకు తెలీదుగా మరి.." తప్పించుకుందామని విఫల ప్రయత్నం చేసాను.

"ఫోన్ చేసుంటే తెలిసేదిగా.." తన కళ్ళు నన్ను చూసి నవ్వుతున్నాయి.

అయ్యో రామా.. ఏదీ తిన్నగా చెప్పడా ఈ అబ్బాయి. అప్పుడే సరిగ్గా చెప్పి ఉండొచ్చుగా. ఇంతా చేసి ఈ నెల రోజులు బాధపడింది కాక చివరికి దీనంతటికీ కారణం కూడా నేనే అయ్యానా? అమ్మో నిజంగానే మేజిక్ వచ్చులా ఉంది. నన్నే నా చేత తప్పనిపించేస్తున్నాడుగా!

హ్మ్.. తప్పొప్పుల సంగతి ఎలా ఉన్నా తనంటే నాకెంత ఇష్టమో, తను లేదని నేనెంత బెంగపడ్డానో తనకి అర్థమయ్యేలా చెప్పడమెలా? మళ్ళీ ఆలోచనల్లో జారిపోయాను.

"పోన్లెండి. అయిపోయిందిగా.. మీరు మర్చిపోయినా నేను మళ్ళీ వచ్చి కనిపించానుగా" ఎప్పట్లాగే అతి మామూలుగా చెప్పేసాడు నాకూ, నా ఆలోచనలకీ కలిపి కళ్ళేలు వేస్తూ.

ఆ తర్వాత ఆఫీస్, వర్క్, బుక్స్, సినిమాలు ఇంకా ఏవేవో మాటలు దొర్లి చాలా సమయమే గడిచిపోయింది. వాచ్ కేసి చూసుకుంటే పదకొండు నలభై అయింది. ఇంక వెళ్దామని లేచి బయట పడ్డాం. నా వెనకే ఇంటిదాకా వచ్చి దింపాడు. అప్పుడే వెళ్ళిపోవాలా

అని మహా గుబులుగా ఉంది. తనని వదిలి కదలనని పాదాలు మొండికేస్తున్నాయి. తనలో మాత్రం ఏ మార్పూ లేదు. ఎప్పట్లాగే అంతే స్థిమితం. 'గుడ్ నైట్' చెప్పేసి వెనక్కైనా తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

హ్మ్... ఏదో అర్థం అయ్యీ కానట్టు మనసంతా ఆనందమో, బాధో కలిసిపోయి అసంపూర్ణంగా ఉంది. నేను తనని అలక్ష్యం చెయ్యలేదనీ, తనకి నా మనసులో ప్రాణసమానమైన విలువ ఉందని తనకేదీ వివరణ ఇవ్వలేకపోయాను. నేను ఇవ్వాలనుకున్నా తను ఆశించడం లేదుగా!

తనతో కలిసి ఒక్కో అడుగు వేసే కొద్దీ మరింత బలంగా తన వైపుకి లాక్కుంటున్నాడు. రోజు రోజుకీ మరింత చిక్కు ప్రశ్నలా మారిపోతున్నాడు. ఈ అబ్బాయి పైకి కనిపించేది, మాటల్లో వినిపించేది కాకుండా లోపల మొత్తంగా వేరే ఇంకో వ్యక్తి ఉన్నాడనిపిస్తుంది. తన చుట్టూ ఉన్న బలమైన వ్యక్తిత్వపు పొరలన్నీ దాటుకుని మనసుకి దగ్గరగా వెళ్ళి తరచి చూస్తే తప్ప కనిపించదా సున్నితత్వం.. కానీ అంత చేరువగా తను రానివ్వాలి కదా!

ఆలోచనల్లో మునిగి తేలుతూ మెల్లగా మెట్లెక్కి గుమ్మం ముందుకొచ్చి తాళం తీద్దామని లైట్ వేసాను. గుమ్మం పక్కన దాదాపు నాలో సగం ఎత్తున్న పెద్ద అట్టపెట్టె కనిపించింది. ఏంటా అని చూస్తే పైన నా పేరుతో చిన్న లేబుల్ రాసుంది. ఆశ్చర్యపోయి లోపలకి తీసుకెళ్ళాను.

మరీ పెద్ద బరువేం లేదు లోపల ఏముందోనని తెరిచి చూద్దును కదా.. బోలెడన్ని ఎర్ర గులాబీలు.. ఏమీ అర్థం కాక అయోమయంగా చూస్తుంటే ఎర్రగులాబీల మధ్యన చిన్న ఉత్తరం కనిపించింది. మెల్లగా మోకాళ్ళ మీద కూర్చుని తెరిచి చూసాను.

"ఐ కెన్ నెవర్ ఫైండ్ యాన్ ఆల్టర్నేటివ్ ఫర్ యు. యు ఆర్ ద ఓన్లీ వన్ ఆఫ్ ఎ కైండ్ ఇన్ దిస్ వరల్డ్. ఎప్పటికీ నాతో ఉండిపో.."

కళ్ళల్లో నిండిన నీళ్ళు ధారాపాతంగా కురిసి అక్షరాలని తడిపేస్తున్నాయి. అంతులేని ఆశ్చర్యం, అనంతమైన ఆనందం, ఇంకేదో పదాల్లో ఒదగలేనంత, మాటల్లో చెప్పలేనంత అద్భుతమైన అనుభూతి కమ్ముకొచ్చి తమకి కన్నీరు తప్ప మరో భాష తెలీదంటున్నాయి. అంతటి సంబరంలోనూ.. నీలాంటి నువ్వు ఇంకెక్కడా దొరకవేమో కాబట్టి నువ్వు కావాలని చెప్పడం, నాతో ఉంటావా అని అనుమతి కోసం ఎదురు చూడకుండా నాతో ఉండిపొమ్మని అంత అధికారంగా చెప్పడం చూసి.. అబ్బా ఎంత పొగరూ ఊ ఊ... అని తెరలు తెరలుగా నవ్వు...

చిత్రంగా ఇప్పుడు నా నవ్వుల్లోనూ పున్నాగ పూల జల్లు కురుస్తోంది.. ఈ వెన్నెల రేయిలో వెలిగిపోతూ!

**Click here to share your comments on this story**